క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం



వకుళమాత ఆలయ వార్షికోత్సవానికి మంత్రిని ఆహ్వానిస్తున్న అధికారులు

తిరుపతి మంగళం : తిరుమల వెంకటేశ్వర స్వామి తల్లి వకుళమాత ఆలయ మొదటి వార్షికోత్సవానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్ ఆహ్వానించారు. వారు గురువారం తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి ఆహ్వానపత్రిక అందజేశారు. వార్షికోత్సవానికి కుటుంబ సమేతంగా రావాలని కోరారు.

పీర్ల చావిడి నిర్మాణానికి విరాళం



చంద్రగిరి(తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం కాలూరు సమీపంలోని ముస్లింపేటలో ఉన్న మసీదు ఆవరణంలోని పేర్ల చావిడి నిర్మాణానికి మల్లవరానికి చెందిన మనోహర్ రూ.50 వేలు విరాళం ఇచ్చారు. మొత్తాన్ని గురువారం ముస్లిం మత పెద్దలు అబ్దుల్, చాంద్ బాషా, షావల్లి, పరేషాకు అందజేశారు.

తిరుచానూరు సీఐగా శివప్రసాద్ రెడ్డి



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పోలీసు స్టేషన్ సీఐగా శివప్రసాద్ రెడ్డిని నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులను జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న సీఐ సుబ్రమణ్యంరెడ్డిని తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌కు బదలీ చేశారు. తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ సీఐగా ఉన్న శివప్రసాద్ రెడ్డిని ఇక్కడ నియమించారు.


11న ప్రవేశ పరీక్ష

భాకరాపేట : ఎర్రావారిపాళెం ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.టి.శ్రీదేవి తెలిపారు. ఇప్పటికే హాల్ టికెట్లు విడుదల చేసినట్లు చెప్పారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. 11వ తేదీ ఉదయం 9 గంటలకు ఎర్రావారిపాళెం మోడల్ స్కూల్‌లో పరీక్ష ఉంటుందని తెలిపారు.

వాహనాల సీజ్

తిరుమల: తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా ట్యాక్సీ పర్మిట్ కలిగిన వాహనాలు ఎల్లో బోర్డుకు బదులుగా, తెలుపు రంగు బోర్డులను వాడుతూ భక్తుల నుంచి అధిక బాడుగలు వసూలు చేసే రెండు వాహనాలు సీజ్ చేసినట్లు ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య తెలిపారు. ట్యాక్సీ పర్మిట్ కలిగిన వోన్‌బోర్డుతో తిరుగుతున్న జీ.మైసూరమ్మ, కృష్ణమూర్తిరెడ్డికు చెందిన రెండు ఇన్నోవాలను సీజ్ చేశామని తెలిపారు. వీటికి తిరుమలకు ప్రవేశం లేదని అలిపిరి టోల్‌గేట్‌లో లేఖను ఇచ్చామని తెలిపారు. వీటిపై దర్యాప్తు గురించి ఆర్టీవోకు నివేదిక పంపామని చెప్పారు.

పరాశరేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా శ్రీధర్‌రెడ్డి



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని యోగిమల్లవరంలో వెలసిన కామాక్షాంబ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా సి.శ్రీధర్ రెడ్డిని, సభ్యులుగా మరో ఏడుగురిని నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బోర్డు సభ్యులుగా వేణుగోపాల్, వాసు, తిరుపాల్ రెడ్డి, అమరావతి, భారతి, రేణుక, వివేక్, గురుకుల్‌ను నియమించారు. శ్రీధర్ రెడ్డి గతంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పనిచేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీధర్‌రెడ్డికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీపీ మోహిత్ రెడ్డి, తిరుచానూరు సర్పంచ్ కే.రామచంద్రారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రయాణికుడిని రక్షించిన పోలీసులు

తిరుపతి అర్బన్: తిరుపతి రైల్వే స్టేషన్‌లో గురువారం రైలు దిగుతూ ప్రమాదం బారిన పడిన ప్రయాణికుడిని రైల్వే పోలీసులు కాపాడారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రం నందిగ్రామ్‌కు చెందిన స్వప్న కుమార్ రాయ్(44) స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్‌లో కాట్పాడి నుంచి తిరుపతికి జనరల్ కోచ్‌లో వచ్చారని తెలిపారు. స్టేషన్‌లో దిగే సమయంలో ప్రయాణికుల రద్దీ వల్ల అదుపుతప్పి కాళ్లు రైలు బోగీకి, ప్లాట్‌ఫామ్‌కి మధ్యలో పెట్టాడని తెలిపారు. వెంటనే గమనించిన ఇద్దరు రైల్వే పోలీసులు అతన్ని కాపాడారని పేర్కొన్నారు. ఇద్దరు పోలీసులను రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, స్టేషన్ మేనేజర్ చిన్నప్పరెడ్డి అభినందించారు. వేసవి నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోందని, రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఘాట్ రోడ్డులో జోరుగా పనులు



అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం ప్రతి నిత్యమూ భక్తులు పెద్ద సంఖ్యలో వాహనాలు, కాలినడకన తిరుమలకు వెళుతుంటారు. గతంలో కురిసిన వర్షాలకు రెండు ఘాట్ రోడ్లలో కొండ చర్యలు విరిగిపడ్డాయి. అలాగే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ క్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు మొదటి, రెండో ఘాట్ రోడ్లలో సైడ్ వాల్స్, పిట్టగోడలు, కల్వర్టుల నిర్మాణం చేపట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి







మరో మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు



మాస్టర్ ప్లాన్ ప్రతిపాదిత మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, డిప్యూటీమేయర్

తిరుపతి తుడా : తిరుపతి నగరంలో మరో మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె గురువారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, అధికారులతో కలిసి ఎస్వీయూ రోడ్డు– జూపార్క్ రోడ్డును కలుపుతూ ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ మీదుగా వెళ్లే ఈ మాస్టర్ ప్లాన్ రోడ్డు నగరవాసులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ ఎస్వీయూ–జూపార్క్ రహదారులను కలుపుతూ నిర్మించే మాస్టర్ ప్లాన్ రోడ్డు చరిత్రలో ప్రముఖ రహదారిగా నిలిచిపోతుందన్నారు. ఎస్వీయూ, స్విమ్స్, బర్డ్, రుయా, మెడికల్ కళాశాలలను అనుసంధానం చేస్తూ పడమట వైపు రోడ్డును అభివృద్ధి చేస్తామన్నారు. తద్వారా ట్రాఫిక్ కష్టాలు తీరుతాయన్నారు. ఎస్వీయూ మొదటి గేటు, 3వ గేటు, ఫ్లైఓవర్ నుంచి మొదలై వెటర్నరీ కళాశాల పక్కన ప్రకాష్‌నగర్ మీదుగా మొత్తం 3 మాస్టర్ ప్లాన్ రోడ్లను తీసుకురావాలని కౌన్సిల్ తీర్మానిందన్నారు. వీటిపై టీటీడీ, ఎస్వీయూ అధికారులతో చర్చించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లను చేపట్టామన్నారు. వాటిలో 6 మాస్టర్ ప్లాన్ రోడ్లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అదనపు కమిషనర్ సునీత, ఎస్ఈ మోహన్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు రామస్వామి వెంకటేశ్వర్లు, ఎంఈ వెంకటరామిరెడ్డి, ఎసీపీ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

బుద్ధ భూమి పుస్తకావిష్కరణ

పాకాల : మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం బుద్ధ భూమి పుస్తకాన్ని ప్రముఖ మాంక్ డాక్టర్ ఆమోరి సుధాకర్ ఆవిష్కరించారు. ఇందులో ఎంఈఓ బాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుధాకర్ మాట్లాడుతూ ప్రేమ, దయ, కరుణ వంటి మానవీయ విలువలతోనే ప్రపంచ శాంతి దొరుకుతుందని చెప్పిన మహనీయుడు బుద్ధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఆంజనేయులు, రాజేంద్రుడు, బాలకృష్ణ, జ్యోతిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ



పాకాల: దామలచెరువు పంచాయతీ పోలిశెట్టివారిపల్లి భారతంమిట్టలో మహా భారత ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహించారు. భీముడిగా నాగరాజ, దుర్యోధనుడిగా చంద్ర పాత్రలు ధరించి రక్తి కట్టించారు. ఈ ఘట్టా న్ని చూడడానికి స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మహాభారత ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

రేపు టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

తిరుపతి కల్చరల్: కేటీ రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటలకు సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యుల నియామకాన్ని ఆమోదించనున్నట్లు తెలిపారు. చనిపోయిన సంఘ సభ్యుల వారసులకు సోషల్ సెక్యూరిటీ స్కీమ్ ద్వారా రూ.50 వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. అలాగే 75 ఏళ్లు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగుల సన్మానం కోసం ఖర్చుల గురించి చర్చించి ఆమోదం తెలపనున్నట్లు తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

తిరుపతి తుడా : కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడంపై ఏపీ హంస చిత్తూరు జిల్లా, గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు గురువారం తిరుపతి రుయా ఆసుపత్రి ఆవరణలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. పాత పెన్షన్‌కు సమానంగా ఏపీ జీపీఎస్ విధానాన్ని తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్, నేడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే ఉద్యోగులకు న్యాయం జరిగిందని తెలిపారు. ఏపీ జీఈఎఫ్ చైర్మన్ చంద్రయ్య మాట్లాడుతూ చంద్రబాబు టైం స్కేల్ విధానాన్ని రద్దుచేసి కన్సాలిటేటెడ్ పే విధానాన్ని తీసుకువచ్చి ఉద్యోగుల కడుపు కొట్టారని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు షకీల, శారద మాట్లాడుతూ జగనన్న మేలును జీవితాంతం గుర్తుపెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఇమ్రాన్, గిరి, శ్రీనివాస్, గురవయ్య, హరి, కాంట్రాక్ట్ ఉద్యోగులు మధుసూదన్, తులసీరామ్, అమర్‌నాథ్, మధు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తుది దశలో తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు

తిరుపతి తుడా : స్మార్ట్ సిటీలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు తుది దశకు చేరుకున్నాయని తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్ కునాల్‌కుమార్ గురువారం న్యూఢిల్లీ నుంచి ఎండీ హరితతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. స్మార్ట్‌సిటీ ఎండీ హరిత మాట్లాడుతూ శ్రీనివాస సేతు ఫ్లైఓవర్, వినాయకసాగర్ అభివృద్ధి, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, క్రికెట్ స్టేడియం, డిస్ట్రిక్ట్ ఆర్ట్ స్టూడియో, ఇండోర్ స్టేడియం ప్రాజెక్టులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టీలెవల్ కార్ పార్కింగ్ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. వాటిని నిర్దేశించిన గడువులోపు పూర్తిచేస్తామన్నారు. స్మార్ట్‌సిటీ జీఎం చంద్రమౌళి, ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రెండు గ్రానైట్ లారీల సీజ్



చంద్రగిరి(తిరుపతి రూరల్): గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను గురువారం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చంద్రగిరి హైవే రోడ్డులో సీజ్ చేశారు. వాటిని ఏఎస్పీ ఈశ్వర్ రెడ్డి చంద్రగిరి పోలీసులకు అప్పగించారు. అనుమతులు లేకుండా గ్రానైట్ రాళ్లను నెల్లూరు నుంచి చిత్తూరుకు శ్రీనివాసరెడ్డి లారీల్లో తీసుకెళ్తుండగా అధికారులు సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చంద్రగిరి ఎస్ఐ వంశీధర్ తెలిపారు.

నాగలక్ష్మికి డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగపు పరిశోధక విద్యార్థిని టంగుటూరి నాగలక్ష్మి డాక్టరేట్ డిగ్రీ పట్టా అందుకున్నారు. ఆమె ప్రొఫెసర్ ఎస్.జ్యోతి పర్యవేక్షణలో తక్కువ బోటులోనే ఎక్కువ సమాచారాన్ని సురక్షితంగా పంపించేందుకు నెట్‌వర్క్‌కి ఏ విధంగా శిక్షణ ఇవ్వాలి అనే అంశంపై పరిశోధన చేశారు.

నేడు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై అవగాహన సదస్సు

తిరుపతి కల్చరల్: బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవనలో శుక్రవారం ఉదయం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు దళితుల హక్కుల పోరాట సమితి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.బలరామ్ తెలిపారు. ఇందులో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పథకాల పరిరక్షణ, రాజ్యాంగం కల్పించిన హక్కుల కాపాడుకోవడం వంటి సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

తిరుపతి తుడా : ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత సూచించారు. ఆమె గురువారం 5వ డివిజన్ సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని సూచించారు. పన్నులు, యూజర్ ఛార్జీల వసూలు, శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 5వ డివిజన్ సచివాలయానికి ఆధార్ సెంటర్ మంజూరు చేయించాలని కార్పొరేటర్ అమర్‌నాథ్‌రెడ్డి కమిషనర్‌ను కోరారు.

జేపీ నడ్డా బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి గాంధీ రోడ్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 10వ తేదీన శ్రీకాళహస్తిలో చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు తెలిపారు. ఆయన గురువారం తిరుపతి నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు.

శ్రీవారి పాదపునీత తొండవాడ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ మల్లం దీపికారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): టీటీడీ టైటిల్ ఉద్యోగి సారకాయల కృష్ణారెడ్డి రచించిన 'శ్రీవారి పాదపునీత తొండవాడ' అనే పుస్తకాన్ని గురువారం పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. చంద్రగిరి మండలం తొండవాడ సాయిబాబా కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో సర్పంచ్ మల్లం దీపికా రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు మల్లం చంద్రమౌళి రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించి పలువురికి అందించారు. రచయిత సారకాయల కృష్ణారెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామానికి సేవ చేయాలని ఉద్దేశంతో గ్రామం ఎలా ఏర్పడింది, గ్రామానికి తొండవాడ అనే పేరు ఎలా వచ్చింది, కండవాడిలో ప్రముఖులు మొగిలి వంశస్తులు ఎలా ఉండేవారు తదితర విషయాలను విశదీకరించి, చరిత్ర ఆధారంగా పుస్తకాన్ని రచించినట్లు చెప్పారు. అనంతరం గ్రామస్తులు రచయితను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మల్లం విశ్వనాథరెడ్డి, ఇందుమౌళిరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, మునిరామిరెడ్డి, సిద్ధముని తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



వేరుశనగ కాయలను పంపిణీ చేస్తున్న ఏవో స్రవంతి

రామచంద్రాపురం: మండలంలో రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఏవో స్రవంతి తెలిపారు. ఆమె గురువారం సీరామాపురం ఆర్బీకేలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో చేపట్టిన వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందన్నారు. తిరుపతి జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ప్రసాద్‌రావు, ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల వ్యవసాయ సలహా బోర్డు అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వేరుశనగ విత్తన కాయల పంపిణీని చేపట్టినట్లు పేర్కొన్నారు. మండలానికి 1,334 బస్తాల కాయలు వచ్చాయని, 754 మంది రైతులకు అందజేశామని అనుప్పల్లి ఆర్బీకేలో 183 మంది రైతులకు 250 బస్తాలు, సీకాలేపల్లిలో 75 మందికి 150 బస్తాలు, సీరామాపురంలో 52 మందికి 70 బస్తాలు, గంగిరెడ్డిపల్లిలోని 46 మందికి 70 బస్తాలు, కుప్పంబాదూరులో 67 మందికి 150 బస్తాలు, కేకేవీపురంలో 32 మందికి 70 బస్తాలు, మిట్టకండ్రిగలో 69 మందికి 150 బస్తాలు, నడవలూరులో 37 మందికి 70 బస్తాలు, నెన్నూరులోని 52 మందికి 84 బస్తాలు, నెత్తకుప్పంలోని 116 మందికి 200 బస్తాలు, సారకాయలపాలెంలోని 35 మంది రైతులకు 70 బస్తాల కాయలు పంపిణీ చేసినట్లు వివరించారు.

పేదల సొంతింటి కల సాకారానికి చర్యలు



శెట్టిపల్లి భూముల్లో లేఅవుట్ ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి
- లేఅవుట్ ఏర్పాటు పనులు ప్రారంభం

తిరుపతి మంగళం : శెట్టిపల్లి పరిధిలో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి ఇంటి నిర్మాణానికి ఎదురు చూస్తున్న పేదల కల సాకారానికి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఆయన గురువారం శెట్టిపల్లి భూముల్లో ఇళ్ల స్థలాల లేఅవుట్ ఏర్పాటు పనులను పూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శెట్టిపల్లి పరిధిలో ఇంటి స్థలాలు కొనుగోలు చేసిన వారికి త్వరలోనే స్థలాలు అందజేస్తామని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ల్యాండ్ పూలింగ్ పేరుతో రైతులు, పేదల భూములను కాజేయాలని చూశారని మండిపడ్డారు. కడుపులు మాడ్చుకుని డబ్బు కూడబెట్టుకుని వేలాది మంది ఇంటి స్థలాలు కొనుగోలు చేశారని తెలిపారు. వారి స్థలాలను రిజిస్ట్రేషన్ కాకుండా చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులతో చర్చించామని తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, కార్పొరేషన్ అధికారుల సహకారంతో తిరుపతి కార్పొరేషన్ నిధులతో లేవుట్లు వేసి లబ్ధిదారులకు ఇంటి స్థలాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బత్తినబాబు, శెట్టిపల్లి భూముల పరిరక్షణ కమిటీ నాయకులు రాధాకృష్ణ, కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితులను విస్మరించిన చంద్రబాబు



ఎంపీ విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న నల్లాని బాబు

తిరుపతి మంగళం : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తన 14 ఏళ్ల పాలనలో ఏనాడూ దళితుల అభ్యున్నతికి కృషి చేయలేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు ఆరోపించారు. దళితులుగా ఎవ్వరైనా పుట్టాలనుకుంటారా? అని దళిత ద్రోహిగా మిగిలిపోయాడని అన్నారు. తాడేపల్లిలో గురువారం వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కో–ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ నాయకుల సమావేశంలో నల్లాని బాబు మాట్లాడారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలతో దళితుల జీవితాల్లో వెలుగులు విరబూశాయని తెలిపారు. దళితులకు ఉన్నత పదవులను కల్పించి ఆదుకున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో దళిత ద్రోహి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పి జగనన్న గెలుపునకు రాత్రింబవళ్లు శ్రమిస్తామని చెప్పారు.

అందరూ ఆరోగ్యవంతులుగా జీవించాలి



వైద్య పరీక్షల శిబిరాన్ని సందర్శించిన చెవిరెడ్డి లక్ష్మి

భాకరాపేట : చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా జీవించాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమని చెవిరెడ్డి లక్ష్మి తెలిపారు. ఆమె గురువారం చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు, ఎగవూరు పంచాయతీల్లో జరుగుతున్న ఉచిత వైద్య పరీక్షల శిబిరాలను సందర్శించారు. వైద్య శిబిరంలో చేస్తున్న వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రక్త సేకరణ, గుండె పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. తుడా ఆర్డీవో భాస్కర్‌నాయుడు వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సర్పంచులు శంకర్‌రెడ్డి, కుమారి, దేవప్రసాద్, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్‌డీ మదనమోహనరాజు, వైద్యాధికారులు శశికళ, అలెగ్జాండర్, ఎంపీటీసీ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు మేలు



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

తిరుమల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖంగా ఉన్నారని ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఆయన గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 23 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. పీఆర్‌సీ, హెచ్ఆర్ఏ పెంచడం వంటి మంచి నిర్ణయాలు సీఎం తీసుకున్నారని తెలిపారు.

నేటి నుంచి వేరుశనగ కాయల పంపిణీ

పాకాల : మండలంలో శుక్రవారం నుంచి వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు ఏవో పుష్పావతి తెలిపారు. మండలానికి 820 క్వింటాళ్లు వచ్చాయని పేర్కొన్నారు. 30 కేజీల బస్తా సబ్సిడీ పోను రూ.1,674కు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి ప్రారంభిస్తారని వివరించారు. రైతులు విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.


క్రీడాకారులకు సర్టిఫికెట్ల పంపిణీ



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చీఫ్ కోచ్ సయ్యద్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్

తిరుపతి కల్చరల్: వేసవి ఉచిత క్రీడా శిక్షణ పొందిన క్రీడాకారులకు గురువారం ఏపీ శాప్ చీఫ్ కోచ్ సయ్యద్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్ సర్టిఫికెట్లు అందజేశారు. స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన వేసవి ఉచిత శిక్షణా శిబిరాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎన్‌జీవో హోమ్‌లో కరాటే మాస్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ కరాటే పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన క్రీడాకారులకు మెడల్స్ బహూకరించారు. చీఫ్ కోచ్ సయ్యద్ మాట్లాడుతూ అన్ని క్రీడలకు సంబంధించి సుమారు 50 ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించామని, సుమారు 2,500 మంది క్రీడాకారులకు 10 మంది స్పోర్ట్స్ అథారిటీ శిక్షకులు శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. తద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. కరాటే మాస్టర్స్ జి.అనిల్‌కుమార్, టి.ప్రసాద్, కే.వినయ్ పాల్గొన్నారు.

జగనన్న ఎదురులేని మనిషి



మించల ప్రదీప్

తిరుపతి తుడా : పేద ప్రజలు బాగుండాలన్న సద్భావన రాజకీయ నాయకుల్లో ఉంటేనే మంచి పథకాలు అమలుచేయడంతోపాటు ఉద్యోగులకు మేలుచేసే నిర్ణయాలు తీసుకుంటారని ఎస్సీ, ఎస్టీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ మించల ప్రదీప్ తెలిపారు. రాజకీయ చరిత్రలో అలాంటి ఒకే ఒక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం, ఓల్డ్ పెన్షన్ విధానంతో సమానంగా జీపీఎస్‌ను తీసుకురావడం, ఏడు వేల ఉద్యోగాలు భర్తీ చేయాలన్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. చంద్రబాబునాయుడు కాంట్రాక్ట్ వ్యవస్థను తీసుకొచ్చి వెట్టిచాకిరీ కి కారకుడయ్యాడని దుయ్యబట్టారు. చంద్రబా బు అధికారంలో ఉన్నన్నిరోజులూ ఉద్యోగ వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. నాడు వైఎస్ఆర్, నేడు జగనన్నతోనే ఉద్యోగులకు మంచి జరిగిందని వివరించారు. రాజకీయ చరిత్రలో జగనన్న ఎదురులేని మనిషిగా నిలిచారని తెలిపారు.

థ్యాంక్యూ సీఎం సార్..



నయనార్ వరప్రసాద్

తిరుపతి తుడా: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన కేబినేట్ తీసుకున్న నిర్ణయాలు ఆయన నిజాయితీ నిబద్ధతకు నిదర్శనంగా నిలిచాయని ఏపీఎన్‌జీవో తిరుపతి జిల్లా వైస్ ప్రెసిడెంట్ నయనార్ వరప్రసాద్ తెలిపారు. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. గతంలో దివంగత సీఎం వైఎస్ఆర్ వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. ఆ తరువాత ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రమబద్ధీకరణ చేసి చరిత్రలో మిగిలిపోయారని వివరించారు. జీపీఎస్ విధానం ఆమోదయోగ్యమని, కేబినెట్‌లో తీసుకున్న 73 నిర్ణయాలు ప్రజా, ఉద్యోగ ఆమోదయోగ్యంగా ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా థ్యాంక్యూ సీఎం సార్ అని కృతజ్ఞతలు తెలిపారు.